అపాయంలో ఉపాలయాలు!

- మసకబారుతున్న యునెస్కో నిర్మాణప్రభ
- ఇటు ఓపెన్ కాస్టు ముప్పు.. అటు భద్రతాలోపం
- ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కొరవడిన భద్రత
- ఉపాలయాల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- పట్టించుకోని కేంద్ర పురావస్తు శాఖ

రామప్ప సరస్సు కట్టపై పిచ్చి చెట్ల నడుమ ఉన్న ఉప ఆలయం

ప్రత్యేక కథనం -3

మైనింగ్ కోరల్లో మహా శిల్ప శిఖరం

వరంగల్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రపంచ వారసత్వ సంపదగా నిలిచిన రామప్ప ఆలయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఇప్పుడు మానవ ముప్పును ఎదుర్కొంటున్నది. సింగరేణి కాలరీస్ కొత్తగా రామప్ప ఆలయం సమీపంలో ఓపెన్ కాస్టు మైనింగ్‌ను మొదలుపెట్టేందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తుండడంతో దాని మనగుడ ప్రమాదంలో పడింది. ఇది మొదలైతే రామప్ప ఆలయానికి వచ్చే వారు పూర్తిగా తగ్గిపోనున్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా ఉన్న ఇక్కడికి పర్యాటకులు వచ్చే పరిస్థితి ఉండదు. మరోవైపు సర్కారు నిర్లక్ష్యం, భద్రతాలేమితో రామప్పతో పాటు దీని పరిసరాల్లోని ఉపాలయాలు శిథిలమవుతున్నాయి. సరైన భద్రత లేకపోవడంతో గుప్త నిధుల వేటలో రాతి కట్టడాలు నేలకూలుతున్నాయి. రాజుల చరిత్ర శాసనాల్లో ఉంటే వారి కాలంలో నిర్మించిన అద్భుత శిల్పకళ సంపద మట్టిలో కలిసిపోతున్నది. నిత్యం అభిషేకాలు, పూజలతో ఆధ్యాత్మికతను ప్రపంచానికి చాటిన దేవాలయాలు, శిల్పాలు రాళ్ల కుప్పలవుతున్నాయి. శతాబ్దాలనాటి జీవకళను తెలియజెప్పే ఘనకీర్తి గల చారిత్రక ఆలయాలు ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ప్రభను కోల్పోతున్నాయి.

యునెస్కో గుర్తింపు వచ్చినా..

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలో రామప్ప ఆలయం ఉన్నది. కాకతీయుల కళావైభవానికి, ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనంగా ఉన్న రామప్ప ఆలయం చుట్టూ పక్కల కిలోమీటరు పరిధిలోనే మరో 20 ఉపాలయాలను నిర్మించారు. కాకతీయుల అద్భుత కళానైపుణ్యం ఉట్టిపడే రామప్ప ఆలయానికి 2021 జూలైలో యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్, కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) గుర్తింపు వచ్చింది. అప్పటి వరకు ఎలా ఉన్నా ఆ తర్వాత దీని ప్రభ మరింత పెరుగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న రామప్ప ఆలయం అభివృద్ధికి నోచుకోకపోగా ఉన్న కట్టడాలు కూలిపోతున్నాయి.

రామప్పలోని గొల్లగుడి వద్ద నంది తలను ధ్వంసం చేసిన దృశ్యం

శిథిలమవుతున్న ఆలయాలు

కాకతీయుల కాలంలో రామప్ప ఆలయంతోపాటు దీనిని ఆనుకుని కాటేశ్వర, కామేశ్వర, నరసింహస్వామి, నంది మంటపాన్ని నిర్మించారు. రామప్ప చుట్టున్న కోటగోడ లోపల గొల్లగుడి, యాకూబ్ సాబ్ గుడి, త్రికూటాలయం, అడవిలో మరో రెండు శివాలయాలు ఉన్నాయి. రామప్ప చెరువు కట్టపై కల్యాణ మంటపం, త్రికూటాలయం (కాటేజీల పక్కన), మరో రెండు చిన్న ఆలయాలు ఉన్నాయి. పాలంపేటలో ఉన్న మరో రెండు శివాలయాలు శిథిలమవుతున్నాయి. ఆదరణ లేకపోవటంతో ఆలయంలోని శిల్పాలు మట్టిలో కలిసిపోతున్నాయి. రాతి స్థంబాలు కూలిపోతున్నాయి. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు తూర్పు ద్వారాన్ని ఆనుకుని ఉన్న ప్రాకారం 36 మీటర్ల వరకు కుప్పకూలింది. దీంతో ప్రహరీ మొత్తంగా కూలిపాంచి ఉన్నది. రామప్ప ఆలయానికి నిర్మించారు. రామప్ప చుట్టున్న కోటగోడ లోపల గొల్లగుడి, యాకూబ్ సాబ్ గుడి, త్రికూటాలయం, అడవిలో మరో రెండు శివాలయాలు ఉన్నాయి. రామప్ప చెరువు కట్టపై కల్యాణ మంటపం, త్రికూటాలయం (కాటేజీల పక్కన), మరో రెండు చిన్న ఆలయాలు ఉన్నాయి. పాలంపేటలో ఉన్న మరో రెండు శివాలయాలు శిథిలమవుతున్నాయి. ఆదరణ లేకపోవటంతో ఆలయంలోని శిల్పాలు మట్టిలో కలిసిపోతున్నాయి. రాతి స్థంబాలు కూలిపోతున్నాయి. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు తూర్పు ద్వారాన్ని ఆనుకుని ఉన్న ప్రాకారం 36 మీటర్ల వరకు కుప్పకూలింది. దీంతో ప్రహరీ మొత్తంగా కూలిపోయే ప్రమాదం ఉన్నది. రామప్ప ఆలయానికి 300 మీటర్ల దూరంలో ఉన్న ఉప శివాలయం పూర్తిగా కూలిపోయింది. ప్రధాన ఆలయంతో పాటు చుట్టుపక్కల 16 ఉపాలయాలూ పూర్తిగా శిథిలమైపోయాయి. కామేశ్వరాలయం పునర్నిర్మాణం కోసం కూలగొట్టి శిలలను కుప్పలుగా పోశారు. చుట్టుపక్కల ఉన్న ఆలయాలన్నీ దశాబ్దాల తరబడి ఆదరణ లేక శిథిలమయ్యాయి. వీటిలో శివాలయం పూర్తిగా కూలిపోయింది. రామప్పతోపాటు లక్ష్మీదేవిపేట, పెద్దాపురం, రామాంజాపురం, నర్సాపురం గ్రామాల్లోని ఆలయాలు సంరక్షణ లేకపోవడంతో సహజత్వాన్ని కోల్పోతున్నాయి. గుప్త నిధుల కోసం వేట కొనసాగుతూనే ఉండడంతో నిత్యం తవ్వకాలు జరిగి నిర్మాణాలు చెదిరిపోతున్నాయి.

రామప్పలోని గొల్లగుడి ఆలయం

ఇటీవలె తవ్వకాలు..

రామప్ప సమీపంలోని గొల్లగుడిలో ఇటీవల గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. గుడి పైకప్పు ధ్వంసం చేశారు. అక్కడ కాకతీయుల కాలం నాటి నిధులున్నాయనే కారణంతోనే కొందరు ఈ పని చేసినట్టు అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. గొల్లగుడిలో ఏడాది క్రితం ఇదే రకమైన తవ్వకాలు జరిగాయి. రామప్ప ఆలయం సమీపంలో గడ్డపారలతో తవ్వకాలు జరిపిన ఆనవాళ్లూ ఉన్నాయి. గుప్తనిధుల కోసం దుండగులు గడ్డపారలతో గర్భగుడిని తవ్వడంతో శివలింగాలు చెల్లాచెదురయ్యాయి. ప్రపంచ వారసత్వ సంపద ఉన్న ప్రదేశంలో ఉండాల్సిన భద్రతా ఏర్పాట్లు కనీసం లేకపోవడం వల్లే ఈ పరిస్థితులు వస్తున్నాయని పురావస్తు నిపుణులు చెబుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రామప్ప పరిసరాల్లో అవసరమైన మేరకు భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

గొల్లగుడి గర్భాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన దృశ్యం

నకిలీ క్లినిక్‌లపై దాడులు

- రూ.3.45 లక్షల విలువైన నకిలీ మందులు సీజ్ చేసిన డీసీఏ
- కరీంనగర్‌లో నకిలీ కాంబినేషన్ డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో గుర్తింపు లేకుండా కొనసాగుతున్న నకిలీ క్లినిక్స్‌పై శుక్రవారం దాడులు నిర్వహించినట్టు డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.3.45 లక్షల విలువైన నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కాప్రా సర్కిల్‌లో లైసెన్స్ లేకుండా కొనసాగుతున్న మెడికల్ షాపును సీజ్ చేసి, రూ.30 వేల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లిలో ఫెర్రోస్ అస్కోర్‌బేట్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్, మంచిర్యాలలో హెమాటినిక్ విత్ జింక్ అండ్ విటమిన్స్ టాబ్లెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్‌లో కేంద్రం బ్యాన్ చేసిన ఎల్-అర్జిన్+సిల్‌డెనాఫిల్ డ్రగ్ కాంబినేషన్, హిమాచల్‌లోని బ్రాడ్ ఇంజక్టబుల్స్, తహ్లివాల్‌తో పాటు ఎల్-ప్రాన్జ్-సిడ్-సాఫ్టజెల్ క్యాప్సుల్స్ అనే కాంబినేషన్, హర్యానాకు చెందిన ఫార్మాకాన్ గైనకాలజీ కేర్ తయారీ చేసిన మందులను సీజ్ చేశారు. నకిలీ క్లినిక్‌లు, లైసెన్స్ లేని మెడికల్ షాపులు, నకిలీ మందుల తయారీ గురించి టోల్‌ఫ్రీ నంబర్ 18005996969కు ఫోన్ చేయాలని డీజీ సూచించారు.

కోదాడ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వరద బాధిత కుటుంబాలు

కోదాడలో వరద బాధితుల ఆందోళన

కోదాడటౌన్, సెప్టెంబర్ 27 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కూచిపూడి గ్రామం, అనంతగిరి మండలం గోండ్రియాల చెందిన వరద బాధితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు కోదాడ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నష్టపోయిన బాధితులను వదిలేసి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారినే అధికారులు జాబితాలో చేర్చారని, రేషన్ కార్డు లేకుంటే కూడా నష్టపరిహారం రాదని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కోదాడ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్ నాయుడు మాట్లాడుతూ వరదల కారణంగా సర్వం కోల్పోయి దిక్కుతోచని అయోమయ స్థితిలో ఉన్న బాధితులకు న్యాయం చేయాల్సిన అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఎన్పీడీసీఎల్‌లో బదిలీల నిషేధం ఎత్తివేత

అక్టోబర్ 4లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం

హనుమకొండ, సెప్టెంబర్ 27: టీజీఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు శుభవార్త. బదిలీల నిషేధం ఎత్తివేస్తూ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మార్గదర్శకాలు జారీ చేశారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. అక్టోబర్ 4లోగా బదిలీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మార్గదర్శకాల ప్రకారం 30 జూన్ 2024 నాటికి రెండేండ్ల సర్వీసు పూర్తి చేసిన వారు బదిలీలకు అర్హులు. ఏడాదిలోపు పదవీ విరమణ పొందేవారికి బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. ప్రత్యేక కారణాలు గలవారు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకొంటే పరిశీలిస్తారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని క్యాటగిరీల ఉద్యోగులకు బదిలీలు జరుగనున్నాయి. నిబంధనల ప్రకారం ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసి బదిలీ పోర్టల్‌లో 28లోగా పొందుపరుచాలి. అభ్యంతరాలు ఉంటే 30వ తేదీలోగా ఫిర్యాదు చేయాలి. అక్టోబర్ 4న బదిలీ చేసే అథారిటీ అధికారులకు ట్రాన్స్‌ఫర్ దరఖాస్తులను అందజేయాలి. ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులు అక్టోబర్ 7లోగా జారీ చేయాలి. బదిలీ అయిన ఉద్యోగులు ఆయా స్థానాల నుంచి అక్టోబర్ 9వ తేదీలోగా రిలీవ్ కావాల్సి ఉంటుందని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అక్టోబర్ 8వ తేదీ నుంచి బదిలీల నిషేధం మళ్లీ అమలులోకి వస్తుందని సీఎండీ తెలిపారు.

ట్రిపుల్ ఆర్‌పై ఉద్యమమే..

- అలైన్‌మెంట్ మార్చే వరకూ పోరాటం
- ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు ప్రణాళిక
- అవసరమైతే ఢిల్లీ దాకా వెళ్తాం
- చౌటుప్పల్‌లో బాధితుల సమావేశం
- హాజరైన చౌటుప్పల్, వలిగొండ మండలాల భూ నిర్వాసితులు

ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ఐక్యవేదిక సమావేశంలో పాల్గొన్న నాయకులు, రైతులు

చౌటుప్పల్, సెప్టెంబర్ 27: రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు భూ నిర్వాసితులు కదం తొక్కుతున్నారు. అలైన్‌మెంట్ మార్చే వరకు పోరాటం ఆగదని, హైదరాబాద్ నడిబొడ్డుకు కాదు ఢిల్లీకైనా సిద్ధమేనని ప్రకటించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం శుభం గార్డెన్‌లో శుక్రవారం ట్రిపుల్ ఆర్ బాధితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భూ నిర్వాసితులు సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి చౌటుప్పల్, వలిగొండ మండలాల్లోని రైతులు పెద్దసంఖ్యలో వచ్చారు. అక్టోబర్1న ఇందిరపార్కు వద్ద ధర్నా చేయాలని రైతులు చర్చించుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు నాలుగు ప్రధాన రహదారులకు 40కిలోమీటర్లు దూరంలో జంక్షన్ ఏర్పాటు చేశారని, కానీ చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాల్లో కేవలం 28కిలోమీటర్లు రంలో నిర్మించడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై ఢిల్లీకి వెళ్లి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలుస్తామని తెలిపారు.

సీఎం, మంత్రులవి పొంతన లేని మాటలు

సీపీఎం నేతలు సీఎం రేవంత్ రెడ్డిని కలిస్తే అలైన్‌మెంట్‌పై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని, వెనక్కి తగ్గేదిలేదని చెప్పారని. కానీ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాత్రం జంక్షన్ 40కిలోమీటర్ల దూరం వెళ్తున్నదని చెబుతున్నారని తెలిపారు. సీఎం, మంత్రుల పొంతన లేని మాటలు నమ్మే పరిస్థితి లేదంటున్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ట్రిపుల్ ఆర్‌పై మాట్లాడడం లేదని మండిపడ్డారు.

ఫార్మాసిటీపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తేతెలంగాణ): వేలాది మంది యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా తెచ్చిన ఫార్మాసిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నేత భరత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఫార్మాసిటీ విషయంలో హైకోర్టుకు కూడా అబద్ధాలు చెబుతున్నారని అని విమర్శించారు.ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేయదలుచుకుంటే రైతుల నుంచి సేకరించిన 14 వేల ఎకరాలను తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు ప్యూచర్‌సిటీ అంటూ హంగామా చేస్తూ రియల్‌ఎస్టేట్ దందాకు తెరలేపిందని దుయ్యబట్టారు.

ఢిల్లీదాకా వెళ్తాం..

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చకపోతే మరింత ఉద్యమిస్తాం. హైదరాబాద్ ఇందిరపార్కు వద్ద ధర్నాకు సిద్ధమయ్యాం. ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే ఢిల్లీ దాకా వెళ్తాం. కేంద్రమంత్రులను కూడా కలుస్తాం.

–చింతల దామోదర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, చౌటుప్పల్

పంట భూములను ఆగం చేస్తరా?

నాకు 11 ఎకరాల భూమి ఉన్నది. వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్న. మా అయ్య కష్టపడి సంపాందించిండు. సగానికిపైగా రోడ్డుకు పోతున్నది. మా కుటుంబం ఎట్ల బతకాలె. పంట భూములను ఆగం చేస్తరా?

–వల్లూరిబోగయ్య, మందోళ్లగూడెం

గురుకులంలో విద్యార్థి మృతి

- జ్వరంతో చికిత్స పొందుతూ కన్నుమూత
- సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటున్న తండ్రి

ములుగు రూరల్, సెప్టెంబర్ 27: గురుకులం విద్యార్థి అనారోగ్యానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన ములుగు మండలం ఇంచర్ల శివారులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో చోటుచేసుకున్నది. విద్యార్థి తండ్రి బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాయిగూడెం మండలం రాజన్నపేటకు చెందిన కోరం చరణ్ (15) గురుకులంలో పదోతరగతి చదువుతున్నాడు. గురువారం గురుకులం నుంచి ఫోన్ చేసి.. చరణ్ జ్వరంతో బాధపడుతున్నాడని, తీసుకెళ్లాలని చెప్పారు. చరణ్‌ను ములుగు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు చికిత్స ప్రారంభించారు. శుక్రవారం ఉదయం విద్యార్థికి మూత్రం బంద్ కావడంతో వైద్యుల సూచన మేరకు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారం నుంచి జ్వరంతో పాటు మూడు రోజులుగా మూత్రం రావడం లేదని వైద్యులు తెలిపినట్టు విద్యార్థి తండ్రి పేర్కొన్నారు. చరణ్ మృతికి గురుకుల సిబ్బందే కారణమని ఆరోపించాడు. ఈ విషయమై ప్రిన్సిపాల్ ఝాన్సీని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ఆర్సీవో హరిసింగ్‌ను సంప్రదించగా విద్యార్థి గురుకులంలో మృతి చెందలేదని, జ్వరం తగ్గిన తర్వాత అతడిని సోదరి ఇంటికి తీసుకెళ్లిందని తెలిపారు. శుక్రవారం జ్వరం ఎక్కువ కావడంతో చరణ్ మృతి చెందినట్టు పేర్కొన్నారు.

మరో రెండు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రేపటి నుంచి 2,3 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కొమురం భీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

'పవర్ జేఏసీ నుంచి వైదొలుగుతున్నాం'

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నుంచి వైదొలుగుతున్నట్టు తెలంగాణ విద్యుత్తు బీ సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, తెలంగాణ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు ప్రకటించారు. పదోన్నతులు సమీక్షించాలన్న డిమాండ్లను జేఏసీ నేతలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో స్వచ్ఛందంగా వైదొలుతున్నట్టు ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భానుప్రకాశ్, బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్ ప్రకటనలో తెలిపారు.

గాంధీభవన్‌లో ముఖాముఖి

320 వినతులు స్వీకరించిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తేతెలంగాణ):హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కార్యకర్తలు, ప్రజలతో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ముఖాముఖి నిర్వహించారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 320 దరఖాస్తులను స్వీకరించారు.

ఉత్తమ పర్యాటకంగా సోమశిల, నిర్మల్

- ఆధ్యాత్మికత, ఆరోగ్యం, కళాత్మకత రంగాల్లో ఎంపిక
- దేశవ్యాప్తంగా 36గ్రామాల గుర్తింపు
- ఢిల్లీలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖర్ చేతుల మీదుగా అవార్డుల స్వీకరణ

అవార్డు అందుకుంటున్న నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక అభివృద్ధి అధ్యక్షుడు నర్సింహ

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి రెండు జాతీయ అవార్డులు వరించాయి. ఉత్తమ పర్యాటక గ్రామాలుగా సోమశిల, నిర్మల్ ఎంపికయ్యాయి. 2024 సంవత్సరానికి కేంద్ర పర్యాటకశాఖ ఉత్తమ పర్యాటక గ్రామాలను శుక్రవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 8 క్యాటగిరీల్లో 36 గ్రామాలను ఎంపిక చేయగా, కళాకృతుల విభాగంలో నిర్మల్, ఆధ్యాత్మిక, ఆరోగ్య విభాగంలో నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమశిల అవార్డులు సాధించాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖర్ అవార్డులను ప్రదానం చేశారు. నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్ టాయ్స్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు ఎస్ పెంటయ్య, నాగర్‌కర్నూలు జిల్లా పర్యాటకశాఖ అధికారి టీ నరసింహ అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు. గత ఏడాది ఉత్తమ పర్యాటక గ్రామాలుగా సిద్దిపేట జిల్లాలోని చంద్లాపూర్, జనగామ జిల్లాలోని పెంబర్తి గుర్తింపు పొందిన విషయం తెల్సిందే.

'నీట్' స్థానికతపై విచారణ 30కి వాయిదా

సుప్రీంకోర్టు ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): నీట్ కౌన్సెలింగ్‌లో స్థానికతకు సంబంధించిన అంశంపై సుప్రీంకోర్టులో విచారణ సోమవారానికి వాయిదా పడింది. మెడికల్ అడ్మిషన్లకు ముందు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదివినవారిని లేదా స్థానికంగా ఉన్నవారినే స్థానికులుగా పరిగణిస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడంపై కొందరు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించడంతో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనిపై ఈ నెల 11న సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాష్ట్ర ప్రభుత్వం.. హైకోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అంగీకరించింది. దీంతో ఆ 135 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు సుప్రీంకోర్టు అవకాశం కల్పించడంతోపాటు హైకోర్టు తీర్పుపై తాత్కాలికంగా స్టే విధించింది. ఆ మేరకు మధ్యంతర ఉత్తర్వులను వెలువరించి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం శుక్రవారం మరోసారి ఈ అంశంపై విచారణ చేపట్టడంతో.. హైకోర్టులో కేసు వేసిన 135 మంది విద్యార్థులకు మాత్రమే కౌన్సెలింగ్‌కు వీలు కల్పించడం అన్యాయమని, దీని వల్ల తెలంగాణ స్థానికతతో మెడికల్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఇతర విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని ప్రతివాదులు తెలిపారు. గత విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను విద్యార్థులందరికీ వర్తింపజేయాలని కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. మధ్యంతర ఉత్తర్వులను సవరించాలంటే ఆనాటి ధర్మాసనంలోని ముగ్గురు న్యాయమూర్తులు విచారణ జరపాల్సి ఉంటుందని పేర్కొన్నది. ఆ ధర్మాసనంలో సభ్యుడైన జస్టిస్ జేబీ పార్థీవాలా ప్రస్తుతం అందుబాటులో లేనందున ఈ అంశంపై ఈ నెల 30న విచారణ చేపడతామని ప్రకటించింది.